# ఆపరేషన్ అపెండిసైటిస్

జోస్యము విద్యాసాగర్

రైలు దిగేప్పటికి రాత్రి పద కొండయింది. స్టేషను ఊరికి దూరం. అయినా వచ్చేప్పుడు రిసీవ్ చేసుకోమని మామయ్యకు టెలిగ్రాం ఇద్దామనుకున్నాను.

ఆయనకు స్కూటరుంది. శుభ్రంగా స్కూటరులో వెనకవైపు కూచుని వెళ్లిపో యుండేదాన్ని. కానీ, టెలిగ్రాం ఇవ్వకపోవ టానిక్కూడ కారణాలున్నాయి. మొదటిది ఆశ్చర్యంలో ముంచెత్తేద్దామనీ, రెండు టైం లేకపోవటము. మూడు నాకు నెప్పి ఎక్కువ కావటము.

నెప్పి అంటే గుర్తుకువచ్చింది. మీకా విషయం చెప్పలేదు కదూ? నెలరోజులుగా కడుపులో నెప్పి. విపరీతంగా వస్తోంది. అప్పటికీ అక్కడున్న డాక్టర్లకు చూప టము. తాత్కాలిక ఉపశమనం కలిగించే నెప్పి మాత్రలు తీసుకోటం జరిగింది.

మా మామయ్య డాక్టరు. ఆయనకి ఎంతో మంచి పేరుంది. హస్తవాసి ఉంది. ఆయన చిన్న ఊర్లోనే ఉంటున్నా మంచి ఎక్విప్ మెంటుంచుకున్నారు. సొఫిస్టికేటెడ్ ఆపరేషన్ థియేటరుంది. పైగా ఎంతయినా మా మామయ్య. ఆయన నాకు తీసుకో బోయే 'కేర్' ఇంకే డాక్టరయితే మాత్రం తీసుకోగలరా? అందుకే వారం రోజులు శలవు పెట్టి వచ్చేశాను - 'సడెన్'గా.

కూలీలు లేకపోతే పీడాపోయింది. ఏదో విధంగా మన 'లగేజి' మనమే దించు కుంటాము. కాకపోతే, ఆ లగేజీని మోసుకుంటూ అంతంత దూరం ఆడదాన్ని అందునా అర్ధరాత్రి ఒంటరిగా వెళ్లగలనా?

'సార్....!'

'ఏమిటమ్మా!' అన్నారు స్టేషను మాస్టారు.

'నాకు ఒక సహాయం చేయాలి?'

'చెప్పండమ్మా!'

'అర్జంటుగా నేను ఊళ్లోకి వెళ్లాలి. మా మామయ్య ఇంటికి చేరుకోవాలి...'

'అలాగేనమ్మా!'

'కానీ ఇక్కడ ఏ ట్రాన్స్‌పోర్టూ లేదు.'

'అవునమ్మా! అందులో ఈ ట్రెయిన్‌కి ఉండరు. దీన్నందుకే 'దెయ్యాల రైలు' అంటారు.'

'ఉష్?' అన్నాను నేను.

'ఏమ్మా?' అన్నారాయన కంగారుగా.

'అబ్బే! ఏం లేదులెండి. నాకు... నాకు దయ్యాలు... అంటే...'

'ఓహ్! అర్థమయింది. చెప్పమ్మా నన్ని ప్పుడేం చేయమంటావు?'

'ఏం లేదు. తోడుగా నాతో మా మామయ్య ఇంటిదాక రాగలరా? అఫ్‌కోర్స్ మీకు పనేం లేకపోతేనే సుమా?'

'పనీలేదు. అభ్యంతర మంతకన్నా లేదు. కానీ...'

'కానీ... చెప్పండి సర్. ఆపేశారేం?'

'ఏం లేదమ్మా! నాకీ ఊరు కొత్త. ఆయన ఇల్లు...'

'అంతేనా? మీరు తోడుండండి. ఆయన ఇల్లు నాకు తెలుసు. నేను దారి చూపుతాను.'

పాపం! ఆయన ఆఫీసు మూసి నాకు తోడుగా నా వెంట వచ్చారు. మళ్లీ ఉదయం దాక ఏ ట్రయినూ లేదట. నేను ఎంత వద్దన్నా వినకుండా నా సూట్‌కేస్‌ని తనే మోసుకువచ్చారు. నైస్‌గాయ్... అనుకు న్నాను. ఆయన షివాల్రీని చూచి మెచ్చు కుంటూ.

అడవి ప్రాంతమేమీ కాదు కానీ, చీకట్లో



## ఈ వారం దెయ్యం కథ



చుట్టూ పుట్టాపొదలతో, కీచురాళ్ళ ధ్వనులతో అడవిలాగే ఉంది. నేను, ఆయన వెనకాల, ఆయన వేసిన అడుగుల్లో అడుగు వేస్తూ నడుస్తున్నాను - నెమ్మదిగా.

'నేను డ్యూటీకి జాయిన్ అయిన రోజు నమ్మా!'

'ఏమయిందండీ!'

'ఇదుగో ఇక్కడ!' అంటూ ఆగిపోయి వేలెత్తి ఓ ఊడలు జారిన మఱ్రిచెట్టును చూపించుతూ... ఇక్కడ ఒక వ్యక్తిని దారుణంగా చంపివేశారు.

'అయ్యో పాపం!' అన్నాన్నేను. కానీ, నాకెందుకో గుండె దడదడా కొట్టుకోసాగింది. ఆయన వేలెత్తి చూపించిన మఱ్రిచెట్టు దయ్యంలా జుత్తు విరబోసుకుని ఉన్నట్లుంది. ఆ భయం గుండెల్లోకి ఎగతంతే ఇంచుమించు ఆయన చేతిని పట్టుకుని పక్కన్నే నడచాను. నేను తలెత్తితే ఒట్టు.

'తమాషా ఏమిటంటే... ఆ చంపబడ్డ వ్యక్తి... ఈ ప్రాంతంలో ఎక్కడో ఇక్కడే దయ్యమయి తిరుగుతున్నాడని పుకారు.'

'సార్...!' నా గొంతులో వణుకు మొదలయింది.

'ఓ ! అయాం సారీ...!'

వచ్చేస్తోంది. అదుగో ఆ చివరి ఇల్లే! ఈ మామయ్యా అయినా ఇంటిని ఇంత మూలకు ఊరికి దూరంగా కట్టుకున్నాడేమిటో...! ఆ యింట్లో పడితే ఏ భయాలూ ఉండవు...?

'ఇంకా ఎంత దూరముందమ్మా!'

'అల్దే! అదుగోనండీ! అదే ఆ డాబాయే!'

లైట్లు వెలుగుతున్నాయ్. అంటే మామయ్య ఇంకా పడుకోలేదన్న మాట. లేక ఎవరన్నా పేషెంటును చూస్తున్నాడన్నమాట.

'థాంక్స్! మాష్టారూ! ఇదే మా మామయ్య ఇల్లు. నేను లోపలకు వెడతానులెండి. మీరు... మీరు నాకోసం చాల శ్రమ తీసుకున్నారు. గుడ్‌నైట్...' అన్నాను నేను.

'గుడ్‌నైట్...!'

ఆయన చీకట్లో కనిపించకుండా పోయేంతదాక చూచి కాంపౌండ్ గేటుతీసి లోపలకు వరండాలో నడచి కాలింగ్ బెల్ నొక్కాను.

'ఎవరూ?'

'నేను. నేను మామయ్యా!' అంటూ మామయ్య దగ్గరగా వెళ్లేను. మామయ్య నేననుకున్నట్లే డాక్టరు దుస్తుల్లో ఉన్నాడు. అప్పుడే ఆపరేషను థియేటరునుంచే వస్తున్నట్లున్నాడు.

'వాట్ ఎ సర్‌ప్రయిజ్! నీవు...నీవు'

'ఆ... సర్‌ప్రయిజ్ చేద్దామనే ఇలా

చెప్పాపెట్టకుండా వచ్చేశా!'

'మరి, ఇంత రాత్రి ఒక్కదానివి అంత దూరం ఈ లగేజితో.. వచ్చావా?'

'అంత పిరికిదాన్నా మామయ్యా నేను?'

'కాదనుకో...? అయినా...'

'నీ అనుమానం నిజమే మామయ్యా! స్టేషను మాష్టారు సాయం తీసుకుని వచ్చానులే! ఒక్కత్తిని రాలేదులే!'

'ఆ... అలా చెప్పు. సరేగాని పదపదా! లోనికి పదా?'

గీజర్‌లోని వెచ్చని నీళ్ళతో షవర్ బాత్ చేసి, వెంట్రుకలని ఆరబెట్టుకున్నాను. అప్పుడు వచ్చింది నెప్పి. విపరీతంగా భరించలేనంత - మెలికలుతిరిగి పడిపోతున్నాను.

'మామయ్యా!' అంత నెప్పిలోనూ గట్టిగా కేకవేశాను.

మామయ్య ఎక్కడో ఇంకో గదిలో ఉన్నట్లున్నాడు. నా కేకను విని పరుగు పరుగున వచ్చారు. 'ఏమ్మా! ఏమయిందమ్మా! ఎందుకలా.. ఏం నెప్పి తల్లీ...?' మామయ్య గాబరా ఆతృత చెప్పనక్కరలేదు.

'ఇక్కడ మామయ్యా?'

'కడుపులోనా, ఎడమవైపా?'

'ఆ.. అదేదో నులిపెట్టినట్లు...'

'అగు.. పరీక్షించుతాను!'

మామయ్యా నన్ను ఆ తరువాత గంట సేపు తెగపరీక్షలు చేశాడు. నేను మాత్రం నెప్పితో, భరించలేని బాధకు సుళ్ళు తిరిగి పడిపోతున్నాను.

'ఎపెండిసైటిస్. వెంటనే ఆపరేషన్ చేయాలమ్మా!'

'అసలు... అసలు మామయ్యా! నేన్నీ దగ్గర ఇది చెక్ చేయించుకోవటానికే నేను

## ఆపరేషన్ అపెండిసైటిస్

వచ్చింది. నేనిక్కడ ఉండగా ఈ నెప్పి రాదేమో ననుకున్నాను. నెప్పి ఉన్నప్పుడేట కదూ, ఈ ఆపరేషను చేయాల్సింది.'

'అవునమ్మా! మరి చేయమంటావా?'

'చేస్తావా మామయ్యా!'

'ఏ మ్మా? నా శక్తిమీద నమ్మకం లేదా తల్లీ!'

'నమ్మకం లేకపోవడమా? అంత భాగ్యం కలిగినందుకు సంతోషిస్తాంటేను.'

నాకేదో అయిపోతోంది. మామయ్య నన్నేమో చేసేస్తున్నాడు. అనెస్తీషియా ఇచ్చినట్లున్నాడు. మత్తుగా ఉంది. మగతగా ఉంది. కళ్లుమూతలు పడిపోతున్నాయి. మామయ్య మాటలు ఏవేవో వినిపిస్తున్నాయి. లీలగా... దూరంగా మాట్లాడుతున్నట్లు-చెవికి మెల్లగా వినిపిస్తున్నాయి. ఎక్కడో కడుపుదగ్గర కరకరమని కోస్తున్నట్లు.. పేగులు కదులుతున్నట్లున్నాయి.


'మామయ్యా! పేగులు కదిలిపోతున్నాయి.'

'పేగు లెక్కడ కదులుతాయమ్మా! పిచ్చి...'

ఎప్పటి మాట అది? మామయ్యా అప్పుడూ అంతే! అవి గుర్తుకు వస్తున్నాయి. అదుగో అత్తయ్యా. అత్తయ్య ఉందంటే అది ఎంత లేదన్నా పదిహేనేళ్ళ కిందటి మాటే. అప్పటి విషయాలు. అప్పటి సంగతులు.

'చూడమ్మా! మీ అత్తయ్య మునిగిందా?'

'మునగటమా?'




'అంటే మునగటం కాదమ్మా? భక్తి.. భక్తిలో పడిపోవటము. ఆమె ఆ భక్తిలో పడిపోయిందంటే మనం కనిపించనే కనిపించము ఆమెకి.'

'అది తప్పా మామయ్యా?'

'తప్పెలాగవుతుందమ్మా?'

'మరి దెప్పుతున్నావేం?'

'భక్తీ అవీ' ఏదయినా ముందు తాను చేయవలసిన విద్యుక్తధర్మం మరచిపోకముందే. అది మరచిపోయి భక్తి.. భక్తీ అంటే సరిపోదు.

'అంటే అత్తయ్యా....?' అనుమానంగా చూచాన్నేను.

'భర్తకు అన్నీ అందించటము, సకల సదుపాయాలు అవీ చేయటము భార్య ధర్మము. అవి నెరవేర్చకుండ...'

'మీరెప్పుడూ అలాచేయలేదా మామయ్యా

'నా వృత్తిని నేనెన్నడూ విస్మరించలేదు...'

'వృత్తిని విస్మరించలేదు. వాస్తవమే. వృత్తినే ధర్మంగా పెట్టుకుని, భార్యగా ఆమెకు మీరివ్వాల్సిన కొన్ని కనీసపు కోరికలని గూడా తీర్చకుండాపోవటం అధర్మం కాదా మామయ్యా?'

'అంటే నేను... నేను మీ అత్తయ్యనూ...?'

'అంటే మీరు. మీరు మీ భార్యను...'

'అమ్మాయ్! నీవు... కాలికేస్తే మెడకు... మెడకువేస్తే కాలికి వేస్తున్నావు.'

'ఇంతకీ... అసలు నిర్ణయం చెప్పలేదు.'

'ఓకే....ఓకే....'

వాళ్లిద్దరూ ఎంత ఆనందంగా ఎంత హాయిగా ఎంత కలసి మెలసి ఉండేవారనీ? కానేం లాభం? ఆ పరమాత్మునికే కన్నుకుట్టింది. ఆ జంటను చూచాక ఆ ఆదిదేవుడికే అసూయ కలిగింది. ఫలితం ఆమె హఠాత్తుగా కడుపునెప్పితో.. తీసుకుని చచ్చిపోయింది.

'ఎంతపని చేసేవు మామయ్యా?' అన్నా నానాడు.

'జ్యోతీ?'

'కాకపోతే ఏమిటీ మామయ్యా! వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించటం మంచిదే, కానీ దానికన్నా ముందు మానవతాధర్మం ఉంది...'

'జ్యోతీ!'

'కోపం వచ్చిందా మామయ్యా! అత్తయ్య అలా బాధతో వలిగిపోతూన్నా ఏమయిందని అడగకుండా నీ వృత్తిధర్మాన్ని ఎలా నెరవేర్చావు మామయ్యా? భార్యగా ఆమె బాధ ఏమిటో కనుక్కోలేకపోయేవు సరే. కనీసం... కనీసం డాక్టరుగా కూడా ఆమె జబ్బుని డయాగ్నస్ చేయలేకపోయేవు.'

'జ్యోతీ! తను నాకు చెప్పలేదమ్మా!'

'కడుపు పట్టుకుని బాధపడుతున్నపుడన్నా కనుక్కోవాల్సింది. ఆఖరుకు మీరు డాక్టర్లు కద మామయ్యా?'

'అవునమ్మా! నేను తప్పుచేశాను. నేను తప్పు చేశానమ్మా! ఆ తప్పు నన్నింత నష్టానికి గురిచేస్తుందని...'

'ఇది తెలిస్తే ఎవరయినా ఇక నీదగ్గరకు వస్తారా మామయ్యా?'

'పోతే పోనీమ్మా! నాకేం దిగులు? చెట్టంతది - నాది... నాదనుకున్న నా అర్థభాగమే పోయింతరువాత... ఈ వృత్తి ఉంటేఎంత పోతేయేంత? ఎవరు వచ్చినా రాకపోయినా నాకేమమ్మా!?'

'ఎవర్రాకపోయినానేనువస్తాను మామయ్యా!'

'పిచ్చిదానా? ఇప్పుడిలాగంటున్నావు కానీ, పెళ్లయిపోయేక... నీ వెక్కడో నేనెక్కడో. నెప్పి వచ్చిందని, నా దగ్గరకు వచ్చేదాక ఆగుతావా? ఎక్కడినుంచో ఇక్కడికి రాగలవా?'

'వస్తాను మామయ్యా!'

'రామ్మా! రా! తప్పక అప్పుడు నేనే నీకు ఆపరేషను చేస్తా? నీకు ఆపరేషను చేసినచోట కుట్లుకూడా కనిపించనంత పర్ఫెక్టుగా చేస్తాను...నేను... నేనుంటే... అప్పటికి నేనుంటేనే!'

'ఉండకెక్కడికి పోతావు మామయ్యా?'

'అదేమిటమ్మా! నేనెప్పుడూ బ్రతికి ఉంటానా?'

'ఉంటావు ఉండి తీరుతావు. నాకేదయినా వస్తే నీకే... నీవే ఆపరేషను చేస్తావు...'

'ఒకవేళ చచ్చినా...వచ్చి...'

ఏదో మళ్ళీ కడుపుదగ్గర కలుక్కుమంది. నా ఆలోచనలకి స్వస్తిచెప్పినాను. మెదడులో ఏదో చల్లగా... ఏవో రంగు రంగుల పూలు తిరుగుతున్నట్లు ఎర్రగా... పచ్చగా... నల్లగా...? కట్టు కడుతున్నారు కాబోలును. కుట్లు వేశారా? ఎన్ని పడ్డాయో? ఏమాత్రం అనిపించనే లేదు సుమా? అయినా ఎలా అనిపిస్తుంది? అనెస్తీషియాలో ఉంటే...

మామయ్యా... మామయ్యా...! ఎంత హాయిగా ఉంది మామయ్యా! నెప్పి ఇలా తీసి అలా పారేసినట్లుంది. ప్రాణం ఎంతగా ఎగురుతూంది బాధపోయి...

మళ్లీ మగత...! తెల్లకోటు. ఎవరో లైట్ పెట్టి చూస్తున్నారు గుండెమీద. ఎవరో చెవిదగ్గరకు వచ్చి చెంపను చిన్నగా తాకుతూ జ్యోతీ...జ్యోతీ అంటున్నారు. మళ్ళీ మత్తు...మైకం...

** ** ** ** **

తలుపులు ఎవరో తెగబాదుతున్నారు. కలకాదు. నిజమే గబుక్కున లేచి..



# ధర్మేంద్ర - జయల స్నేహం?!

తనతో నటించేందుకు జయప్రద ఒప్పుకోక పోవటమే కాకుండా మరీ ముసలిజోడీ అని ధర్మేంద్రను అనటంతో కోపిష్టి ధర్మేంద్ర- హేమమాలినిని ఆకట్టుకున్నట్లే జయను కూడా ఆకట్టుకోవాలని ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడట. దానితో జయప్రద- ధర్మేంద్రతో సినిమాల్లో నటించేందుకు ఒప్పుకుంది. ధరమ్- జయల స్నేహం మరింత గట్టిపడి పోతుందేమోనని అటు హేమ, యిటు జయప్రద భర్త భయపడుతున్నారట.

పక్కమీది నుంచి దూకి చీరసర్దుకుని తలుపుతీశాను. ఎదురుగ్గా స్టేషను మాస్టారు.

'ఓ మీరా! మీరు నిన్న నాకు సహాయం చేసిన స్టేషను మాస్టారు కదూ?' అన్నాను.

'రండి...రండి'

'వస్తాను. గానీ, ఇది చెప్పండి ముందు. రాత్రి రాత్రి మీకు ఏమీ భయంగానీ బాధగానీ కాలేదు కదా?'

'అబ్బే! లేదు. మా మామయ్య గారింటిలో... అయినా నాకేం భయమండీ! మరీ విచిత్రం! కాకపోతే ఒకటి...రాత్రి మీరు వెళ్లాక కాసేపటికి విపరీతమయిన కడుపునెప్పి...'

'మీకేకలు వినిపించాయి అని చెప్పాలెండి.'

'అవునా! అవునేమో. అంతగా అరిచానేమో? కానీ మా మామయ్య అప్పటికప్పుడు నాకు ఆపరేషను చేసేశారు.'

'ఆపరేషనా?'


'ఆ... అపెండిసైటిస్ అని డయాగ్నయిస్ చేసేరు. టెస్ట్‌లన్నీ కండక్ట్ చేసి 'ఆపరేషన్ ఎ మస్ట్' అన్నారు.

'జ్యోతిగారూ?'

'మరేం కంగారులేదులెండి. అసలు మీకింకో విషయం తెలుసా? నేను వచ్చిందే అందుకోసం! నేనాయనకి ఒక ప్రామిస్ చేశానండి.'

'ప్రామిస్సా?'

'ఆ... నా జీవితంలో ఎప్పుడు ఏ బాధ వచ్చినా ఫస్ట్‌ట్రీట్‌మెంటూ... ఇఫ్ నెసెసరీ ఆపరేషనూ ఆయనే చేయాలని... చేయించుకుంటాననీ...'




'చేసేరా? అయితే'

'భలేవారే ఇందులో అనుమానమేముంది? పైగా అయాం సోమచ్ రిలీవ్డ్ యూసీ...! సక్సెస్‌ఫుల్...'

'ఎక్కడ చేసేరూ?'

'ఇక్కడే థియేటర్‌లో...'

'అనెస్తీషియా? లోకలా జనరల్లా?'

'జనరలే! ఎంత తీయని మైకమండీ అదీ?'

## అపరేషన్ అపెండిసైటిస్

'జ్యోతిగారూ మరేమనుకోపోతే, ఒక్కసారి మీ మామయ్యనీ, ఆ థియేటర్‌నీ చూపించుతారా?'

'ఏం...? ఎందుకనీ?' నవ్వేను నేను అదోలా...

'అబ్బే! ఏంలేదు. జస్ట్ క్యూరియాసిటీ? అంతే...'

'అంతేకదా! ఒకే! రండి! మామయ్యా! ఓ మామయ్యా! ఇలా రండి. ఇది అర్రె ఇది...' అంటూ ఆశ్చర్యపోయాను. ఎదురుగా అన్నీ పగిలిపోయి బూజుపట్టి పాడు బడ్డ థియేటర్ వెక్కిరిస్తూ నాక్కనిపించింది. మట్టీ...దుమ్మూ....ధూళీ...

'ఓహ్! గాడ్!' అన్నాను నేను.

'ఏం...? ఏమయింది?'

'ఇదేమిటి ఇలా అయిపోయింది? ఇందాక ఇక్కడ ఈ బెడ్‌మీదనే నేను పడుకుని ఉన్నది. ఈ థియేటర్... యస్ ఈ థియేటర్‌లోనే నాకు మా మామయ్య ఆపరేషన్ చేసింది. ఇదేమిటి ఇలా అయిపోయిందీ?' అన్నాను నేను. నా గొంతులో నాకే తెలియని జీర. ఏదో భయం.

'జ్యోతిగారూ! కూల్‌డౌన్ రిలాక్స్. రిలాక్స్.'

'సార్! మీకు...మీకు ఇదంతా? ఇదంతా తెలుసా?'

'ఇపుడే తెలిసింది?'

'తెలిసిందా? ఏమిటి?'

'చెప్పనా నిన్న చెప్పాను చూడండీ రాత్రి మీకు. ఈ ప్రాంతంలో నేను వచ్చిన కొత్తలో ఒకరిని హత్య చేసేరనీ, ఆయన... ఆయనే మీ డాక్టరు మామయ్య!'

'నో... నాట్! ఇట్సింపాజిబుల్ నేను రాత్రి ఆయనతో బాగా మాట్లాడాను. ఆయన... ఆయన న్నాకు ఆపరేషన్.

'లేదు... లేదు జ్యోతిగారూ! ఇది నిజం! ఆయనని ఎవరో చంపారు. ఆయనే దయ్యం అయి తిరుగుతున్నట్లు అందరూ అనుకుంటున్నారు. ఇప్పుడు చూడండి ఈ ఇల్లు...'

'యస్! కానీ...కానీ, నాకు ఆపరేషన్...'

'పోనీ, మీరేమీ అనుకోపోతే కాస్త అక్కడ బొడ్డుపక్కన చూస్తారా? మీకు ఆపరేషన్ చేసేరన్న చోటు...'

'అలాగే...!'

జ్యోతి నడుముదగ్గర కట్టుకున్న చీరె కట్టు కొంచెం తొలగించి చూచింది. అక్కడ జర్రిపోతు ఆకారంలో.... ఆపరేషన్ చేస్తే కుట్లు కుట్టితే మానిపోయిం తరువాత ఏర్పడే మచ్చలా కనిపించీ కనిపించక గీత...

'మామయ్యా! నేను నా మాట నిలబెట్టుకుంటే... చచ్చికూడ నీ మాట నీవు నిలబెట్టుకున్నావ్ మామయ్యా!' అంది జ్యోతి... కడుపు మీదున్న గీతను అలవోకగా చేత్తో తాకుతూ...

o